సాక్షి అనకాపల్లి

శనివారం, 31, ఆగస్టు, 2024



అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

విశాఖ: శ్రావణ శుక్రవారం సందర్భంగా వివిధ రకాల పండ్లు, పూలతో కరకచెట్టు పోలమాంబను ప్రత్యేకంగా అలంకరించారు.



డీఆర్ఎం తనిఖీలు

విశాఖ: డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ కేకే లైన్ కొత్తవలస–అరకు మధ్య శుక్రవారం భద్రతా తనిఖీలు నిర్వహించారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉండి తేలికపాటి వర్షం పడే అవకాశం ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం పేర్కొన్నారు. ఈనెల 31న 18 మి.మీ. సెప్టెంబర్ 1న 15, 2న 15 3న 21, 4న 16 మి.మీ వర్షపాతం నమోదవుతుందని ఆమె చెప్పారు.

న్యూస్‌రీల్

చెరువుల్లో గంబూషియా చేప పిల్లలు



తుమ్మపాల చెరువులో గంబూషియా చేప పిల్లలను వదులుతున్న డీఎంహెచ్‌వో బాలాజీ

అనకాపల్లి: కీటక జనిత వ్యాధుల నిర్మూలనలో భాగంగా దోమ లార్వాను తినే 'గంబూషియా చేప పిల్లలను' నీరు నిలువు ఉండే చెరువులు, కుంటలు, బావుల్లో వదిలామని డీఎంహెచ్‌వో బాలాజీ చెప్పారు. తుమ్మపాల పీహెచ్‌సీ పరిధిలో నీటి నిల్వ ప్రదేశాల్లో శుక్రవారం గంబూషియా చేప పిల్లలను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్న సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. జిల్లావ్యాప్తంగా లక్ష గంబూషియా చేప పిల్లలను పంపిణీ చేశారన్నారు. డీఎంవో కె.వరహాలుదొర, తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యురాలు నసురత్ షమీమ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు



తాటిచెట్లపాలెం (విశాఖ): ప్రతికూల వాతావరణం, భారీ వర్షాల కారణంగా విశాఖపట్నం–కిరండూల్–విశాఖపట్నం(18514/18513) నైట్ ఎక్స్‌ప్రెస్ శని, ఆదివారాల్లో) దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖపట్నం–కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 31, సెప్టెంబరు 1 తేదీల్లో వయా విజయనగరం, రాయగడ, కోరాపుట్ మీదుగా దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఆగస్టు 31, సెప్టెంబరు 1 తేదీల్లో కిరండూల్ నుంచి బయల్దేరవలసిన కిరండూల్–విశాఖపట్నం(18513) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ నుంచి బయల్దేరి వయా కోరాపుట్, రాయగడ, విజయనగరం మీదుగా విశాఖ చేరుకుంటుంది.

నేడు మహిళా న్యాయవాదుల సదస్సు

విశాఖ లీగల్ : నూతనంగా ఏర్పాటైన విశాఖ మహిళా న్యాయవాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర సదస్సు శనివారం ఉదయం నగరంలోని వీఎంఆర్‌డీఏ బాలల ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు సంస్థ ఉపాధ్యక్షులు సీనియర్ న్యాయవాది కేడీఎల్ నాగశ్రీ తెలిపారు. సదస్సును రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రవి చీమలపాటి, జస్టిస్ రవి తెలహరి ప్రారంభిస్తారు. ఈ సదస్సులో మహిళా న్యాయవాదులు, మహిళలు పని ప్రదేశంలో ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులు అంశంపై పలువురు వక్తలు ప్రసంగిస్తారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇందిరా ప్రియదర్శిని, రాష్ట్ర వినియోగదారుల మండలి అధ్యక్షుడు ద్వారకానాథ్ రెడ్డి, విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, జిల్లా వినియోగదారుల మండలి అధ్యక్షుడు, ఇతర మహిళా న్యాయవాదులు న్యాయమూర్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నట్లు నాగశ్రీ వివరించారు.

'ఎగుమతి వ్యాపారాన్ని ఎలా ప్రారంభించాలి' ఆన్‌లైన్ ప్రోగ్రాం

విశాఖ సిటీ: ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫ్యాప్సీ) ఆధ్వర్యంలో 'ఎగుమతి వ్యాపారాన్ని ఎలా ప్రారంభించాలి' అనే అంశంపై అయిదు రోజుల ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తున్నట్లు ఫ్యాప్సీ కార్యదర్శి పి.వైదేహి తెలిపారు. సెప్టెంబర్ 10 నుంచి 14వ తేదీ వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వెబ్‌సైట్ ఆధారిత సెషన్స్ ఉంటాయని వెల్లడించారు. ఇతర వివరాల కోసం 9391422821 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

ఆదివాసీలకు వర్క్‌షాప్

విశాఖ: లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ (ఆంధ్రప్రదేశ్ హస్తకళ అభివృద్ధి సంస్థ) ఆధ్వర్యంలో పార్వతీపురం మన్యం జిల్లా ఆదివాసీలకు సీతంపేట గ్రామంలో డిజైన్ డెవలప్‌మెంట్‌పై వర్క్‌షాప్, సవర ఆదివాసీలకు పెయింటింగ్ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. లేపాక్షి ప్రిన్సిపాల్ సెక్రటరీ సునీత, ఎండీ బాలసుబ్రహ్మణ్యం, ఈడీ ఎం. విశ్వ, లేపాక్షి కార్యనిర్వహణాధికారి ఆసపు కార్తీక్ నేతృత్వంలో నిర్వహిస్తున్న వర్క్‌షాప్, పెయింటింగ్ శిక్షణ, ట్రైబల్ ఆర్ట్ శిక్షణ కేంద్రాన్ని కలెక్టర్ శ్యాంప్రసాద్ శుక్రవారం తిలకించారు. కళాకారుల ప్రతిభను గుర్తించిన కలెక్టర్ వారిని అభినందించారు. శిక్షణకు పూర్తి సహాయ సహకారాలు, ప్రోత్సాహం అందించనున్నట్లు తెలిపారు. అంతరించిపోతున్న ఆదివాసీ ట్రైబల్ ఆర్ట్‌కు పూర్వ వైభవం రాబోతుందన్నారు.

పూడిమడక.. కొత్త నడక



కలెక్టరేట్‌లో హార్బర్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, మత్స్య శాఖ కమిషనర్ డోలా శంకర్



పూడిమడక సముద్ర తీరం

- ఫిషింగ్ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.387 కోట్లు
- ఏడాదికి ఫిష్ ల్యాండింగ్ సామర్థ్యం 28,700 టన్నులు
- ప్రత్యక్షంగా, పరోక్షంగా పది వేల మందికి ఉపాధి
- 930 బోట్లు, ట్రాలర్ల నిలుపుదలకు అవకాశం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూపుదిద్దుకున్న ప్రాజెక్టు
- శుక్రవారం వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని

ఆ ప్రాజెక్టు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో మొగ్గ తొడిగింది. ఆనాడే ప్రతిపాదనలు కార్యరూపం దాల్చి, నిధులు మంజూరయ్యాయి. సర్వే పూర్తయి సర్వం సిద్ధమైంది. నాటి మత్స్యకారుల కల నేడు సాకారమైంది. ప్రధాని నరేంద్రమోదీ శుక్రవారం వర్చువల్ విధానంలో పూడిమడక ఫిషింగ్ హార్బర్‌కు శంకుస్థాపన చేశారు. హార్బర్ నిర్మాణంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా పది వేల మందికి ఉపాధి లభించనుంది.

తుమ్మపాల: మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపి పుష్కలంగా ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడుగులు వేసింది. జిల్లాలో పూడిమడక కేంద్రంగా సర్వే చేసి 37.07 ఎకరాల ప్రభుత్వ భూమిలో రూ.387 కోట్ల ప్రాజెక్టు అంచనా వ్యయంతో నివేదికను కేంద్రానికి పంపించగా నేటికి కార్యరూపం దాల్చింది. ఈ మేరకు శుక్రవారం ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. మత్స్యకార గ్రామాల్లో 90 శాతం ప్రజలు సముద్ర సంపదపైనే ఆధారపడి జీవిస్తున్నారు. దశాబ్దాలుగా పడవలు, వలలతో కుస్తీలు పడుతూ బతుకు వెళ్లదీస్తున్నారు. వేట అనంతరం పడవలు, వలలు భద్రపరచుకోవడం కూడా కష్టంగానే ఉంటుంది. హార్బర్ లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి జీవనం పొందుతూ వలస జీవులుగా మారుతున్న క్రమంలో అనేక ప్రమాదాలకు గురవుతున్నారు. జిల్లాలో పూడిమడక ప్రాంతంలో హార్బర్ నిర్మాణంతో వారికి మంచి రోజులు రానున్నాయి. ఇటీవల మెరైన అధికారులు పూడిమడక ప్రాంతాన్ని సందర్శించి పూర్తి వివరాలతో కేంద్ర ప్రభుత్వానికి నివేదించారు. హార్బర్ నిర్మాణం పూర్తయితే అచ్యుతాపురం, రాంబిల్లి, పరవాడ, పాయకరావుపేట, ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల మత్స్యకారులకు ఉపయోగకరంగా ఉంటుంది.

- జిల్లాలో 73 కిలోమీటర్ల తీరరేఖ, 32 తీర గ్రామాలు, 28 ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 2,314 మెరైన్ ఫిషింగ్ ఫ్లీట్ ఉన్నాయి. ఇందులో 1,981 మోటారు పడవలు, 333 మోటారు లేని పడవలు ఉన్నాయి. మత్స్యకారుల జనాభా 86,497. ఇందులో 12,996 మంది సముద్రం మీద వేట చేస్తారు. కేంద్రంలో సీఎస్ఎస్–కాంపొనెంట్ ఆఫ్ పీఎంఎంఎస్‌వై కింద ఆమోదం పొందిన పూడిమడక ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కేంద్ర, రాష్ట్ర ఆర్థిక భాగస్వామ్యంతో పూర్తి కానుంది.
- ఫిషింగ్ హార్బర్‌లో బ్రేక్ వాటర్, క్వే, జెట్టీలు, డ్రెడ్జింగ్ ఇతర సౌకర్యాలు ఉంటాయి.
- ప్రాజెక్టు పూర్తయితే 930 ఫిషింగ్ నౌకల వార్షిక ఫిష్ ల్యాండింగ్ సామర్థ్యం 28,700 మెట్రిక్ టన్నులు ఉంటుంది. రూ.263.61 కోట్లకు సమానమైనది. ఇక్కడ ఏటా 4,700 మంది మత్స్యకారులకు ఉపాధి కలుగుతుంది.
- హార్బర్‌కు మహారాష్ట్ర నుంచి ప్రధాని మోదీ శంకుస్థాపన చేయగా కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో శిలఫలకాన్ని కలెక్టర్ విజయ కృష్ణన్, మత్స్యశాఖ కమిషనర్ టి.డోలాశంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేగంగా నిర్మాణం పూర్తిచేసి రాబోయే ఏడాదిన్నర కాలంలో వినియోగంలోకి తీసుకురానున్నట్లు తెలిపారు. హార్బర్ నిర్మాణంతో చాలామందికి జీవనోపాధి కలుగుతుందని, కోల్డ్ స్టోరేజ్‌లు కూడా వస్తాయన్నారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత ఇంత గొప్ప ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టడం వ్యక్తిగతంగా ఆనందంగా ఉందన్నారు. ఈ వర్చువల్ కార్యక్రమంలో వివిధ మత్స్యకార సంఘాల సభ్యులు, ప్రతినిధులు, మత్స్యశాఖ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హార్బర్‌లో చేపల వేటకు అనుమతించాలి

- వాడనర్సాపురం, కొత్తపట్నం గ్రామాల మత్స్యకారుల వినతి

రాంబిల్లి (యలమంచిలి): పూడిమడక ఫిషింగ్ హార్బర్‌లో చేపల వేటకు అనుమతి ఇవ్వాలని వాడనర్సాపురం, కొత్తపట్నం గ్రామాలకు చెందిన మత్స్యకారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కలెక్టర్ విజయ్ కృష్ణన్, మత్స్యశాఖ కమిషనర్ డోలా శంకర్‌లను కోరారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిషింగ్ హార్బర్ శంకుస్థాపన అనంతరం ఈ రెండు గ్రామాలకు చెందిన మత్స్యకారులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాంబిల్లి మండలంలో నేవల్ బేస్ రాకతో తాము జీవనోపాధిని కోల్పోయామని చెప్పారు. గత రెండు సంవత్సరాలుగా నేవీ లోపల చేపల వేటకు అధికారులు వెళ్లనివ్వడం లేదని, నేవీ అధికారులు లోపల సబ్ గేట్లు మూసివేశారని వాపోయారు. గతంలో నేవల్‌బేస్ ప్రధాన ముఖద్వారం వద్ద 150 రోజులు ధర్నా చేశామని, దీని ఫలితంగా జీవనోపాధి ప్యాకేజీ ఇస్తూ పూడిమడక ఫిషింగ్ హార్బర్ జెట్టీ నుంచి చేపల వేటకు సముద్రంలోకి వెళ్లడానికి అనుమతి ఇస్తామని, ఫిషింగ్ జెట్టీలో మా రెండు గ్రామాలకు హక్కు కల్పిస్తామని అప్పటి కలెక్టర్ తమకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. నేవీ వలన సముద్రం కోతకు గురైందని, డ్రెడ్జింగ్ పనుల వలన సముద్రం ఒడ్డున ఎత్తయిన ఇసుక దిబ్బలు ఏర్పడ్డాయని, ఫిష్ లాండింగ్ సెంటర్‌లో బోట్లు ఎత్తడానికి దింపడానికి చాలా ఇబ్బందిగా ఉండటం వలన పక్క గ్రామాలకు వలస వెళ్లి చేపల వేట సాగిస్తున్నామన్నారు. పూడిమడక ఫిషింగ్ జెట్టీలోకి ప్రవేశం లేకపోతే బతకడం కష్టంగా ఉంటుందని, అలా వీలు కాకపోతే తమ పరిసర ప్రాంతాల్లో కొత్త ఫిషింగ్ జెట్టీ నిర్మించాలన్నారు. గ్రామ సర్పంచ్ కారే రామారావు, మాజీ సర్పంచ్ సి.హెచ్ యర్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ విజయ్ కృష్ణన్‌కు, మత్స్యశాఖ కమిషనర్ డోలా శంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకారులు

మత్తు పదార్థాలతో భవిష్యత్ నాశనం



అనకాపల్లి ఆర్టీసీ పార్శిల్ కేంద్రం వద్ద పోలీస్ జాగిలంతో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ అలీ

అనకాపల్లి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండకపోతే భవిష్యత్తు నాశనం అవుతుందని ఎస్పీ ఎం.దీపిక హెచ్చరించారు. ఆమె ఆదేశాల మేరకు అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, పరవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి, తదితర మత్తు పదార్థాల రవాణాను అరికట్టేందుకు ఆర్టీసీ, ప్రైవేట్ పార్శిల్ సర్వీసులు, చెక్‌పోస్టులలో పోలీసు జాగిలాలతో శుక్రవారం విస్తృత తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యువత అక్రమ సంపాదనకు ఆశపడి భవిష్యత్తును నాశనం చేసుకోవడంతో పాటు కుటుంబ సభ్యులకు తలవంపులు తీసుకువస్తున్నారన్నారు. మత్తులో నేరాలకు పాల్పడే అవకాశం ఉందని ఆమె హెచ్చరించారు. గంజాయి కేసులో పట్టుబడితే 10 నుంచి 20 సంవత్సరాల జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా విద్యతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని ఆమె సూచించారు. ఈ తనిఖీల్లో అనకాపల్లి టౌన్ ఎస్ఐ అలీ షరీఫ్, చోడవరం ఎస్ఐ శేఖరం, నర్సీపట్నం టౌన్ ఎస్ఐ సుధాకర్, పరవాడ పోలీసులు పాల్గొన్నారు.

యలమంచిలి స్టేషన్‌లో ప్రత్యేక రైలుకు హాల్టు

యలమంచిలి రూరల్: యలమంచిలి రైల్వే స్టేషన్‌లో మరో ప్రత్యేక రైలుకు హాల్టు సౌకర్యం కల్పించడానికి రైల్వే అధికారులు నిర్ణయించారు. 08557/08558 నంబర్లతో వచ్చేనెల 7 నుంచి విశాఖపట్నం–చెన్నై మధ్య రాకపోకలు సాగించే స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలుకు యలమంచిలిలో హాల్టు సౌకర్యం కల్పించారు. దసరా, దీపావళి పండగల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా నడపనున్న ఈ ప్రత్యేక మెయిల్ రైలు ప్రతి శనివారం విశాఖ నుంచి బయలుదేరి చెన్నైకు వెళ్లి, తిరిగి ఆదివారం చెన్నై నుంచి విశాఖకు వస్తుంది. నవంబరు 30 వరకు ఈ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు జారీ చేసిన ఆదేశాల్లో పేర్కొన్నారు.

విచారణకు వచ్చారు.. వెళ్లారు..

- ఆరు క్వారీల నిర్వహణపై మార్టూరు గ్రామస్తుల ఫిర్యాదు
- విచారణ చేపట్టకుండా వెనుదిరిగిన మైనింగ్ అధికారుల తీరుపై ఆగ్రహం

తుమ్మపాల: క్వారీల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశించిన మార్టూరు ప్రజలకు నిరాశే ఎదురైంది. శుక్రవారం విచారణకు వచ్చిన అధికారులు వాతావరణం సానుకూలంగా లేదంటూ వెనుదిరిగి వెళ్లిపోవడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మార్టూరు గ్రామంలో సర్వే నంబర్–1లోని కొండ చుట్టూ మధుకాన్, అపర్ణ, నవోదయ, ఎక్స్‌జీఎక్స్, ట్రాన్స్‌ర్ట్, రాక్ సిలికాన్ క్వారీలు నిర్వహిస్తున్నారు. ఇక్కడి క్రషర్ల నుంచి దుమ్ము ధూళి ఎగసి మార్టూరు గ్రామంపై పడుతోంది. దీంతో ప్రజలు కిడ్నీ, ఊపిరితిత్తుల సమస్యలతో సతమతమవుతున్నారు. క్రషర్ల నుంచి నివాసానికి కనీస దూరం నిబంధన కూడా పాటించలేదు. దీనిపై గ్రామస్తులు చేసిన ఫిర్యాదు మేరకు మైనింగ్ శాఖ అధికారి ఆర్.స్వాతి పలువురు అధికారులతో కలిసి శుక్రవారం విచారణకు వచ్చారు. ఈ క్వారీల నిర్వహణలో ఎంవోఈఎఫ్ అనుమతులు లేవని, పర్యావరణం, అటవీ, రెవెన్యూ శాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుంచి ఈసీ, ఎన్‌వోసీ, లైసెన్స్‌లు లేవని, గత ప్రభుత్వ హయాంలో క్వారీలను నిలిపివేశారని, 3 కిలోమీటర్ల దూరంలో బ్లాస్టింగ్, క్రషింగ్ చేయాలన్న నియమాన్ని కూడా పాటించలేదని గ్రామస్తులు ఫిర్యాదు చేశారని ఆమె చెప్పారు. అయితే నిబంధనల మేరకు సర్వే చేసి మార్కింగ్ చేసేందుకు బురదగా ఉండడంతో మరోసారి సర్వేకు వస్తామని చెప్పి వెళ్లిపోయారు.

దీంతో గ్రామస్తులు మండిపడ్డారు. క్వారీలతో అనారోగ్యం పాలవుతున్నామని, పంట పొలాలు పాడైపోతున్నాయని, పశువులు మృత్యువాత పడుతున్నాయని వాపోయారు. విచారణకు వచ్చినట్టు వచ్చి వెళ్లిపోవడం మైనింగ్ శాఖ అధికారులకు తగదని చెప్పారు. ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతూ ఖనిజ సంపదను దోచేస్తున్న క్వారీలకు గత ప్రభుత్వ హయాంలో అధికారులు భారీ జరిమానా విధించారని గుర్తు చేశారు.



క్రషర్స్, క్వారీలపై ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న మైన్స్ అధికారులు

ఇండోనేషియా చేరుకున్న ఐఎన్ఎస్ శివాలిక్



ఐఎన్ఎస్ శివాలిక్ సిబ్బందికి స్వాగతం పలుకుతున్న ఇండోనేషియా బృందం

సింధియా (విశాఖ): దక్షిణ చైనా సముద్రం, పసిఫిక్ మహా సముద్రంలో కొనసాగుతున్న కార్యచరణ విస్తరణలో భాగంగా ఐఎన్ఎస్ శివాలిక్ నౌక ఇండోనేషియాలోని సుబరియా పోర్టుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఇండోనేషియా నావికాదళం అధికారులు, సైనిక బృందం భారత నేవీ బృందానికి ఘన స్వాగతం పలికారు.

ఈ పర్యటన ఇరు దేశాల మధ్య దీర్ఘకాల స్నేహం, పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేస్తుందని నేవీ వర్గాలు తెలిపాయి. ఇండోనేషియా నావికాదళంతో ప్రొఫెషనల్ ఇంటరాక్షన్లు, క్రాస్ డెక్ విజిట్లు, క్రీడా పోటీలు, సేవా కార్యక్రమాలు ఉంటాయని పేర్కొంది.

ఇసుక నుంచి.. ఇంధనం వరకు.. 8లో

ముమ్మరంగా వర్షాలు



మాడుగుల రూరల్ : వీరనారాయణంలో వర్షపు నీటితో వరి పొలం

తుమ్మపాల: జిల్లాలో గడిచిన మూడు రోజులుగా ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. దీంతో పంటపొలాల్లో వరి నాట్లు పూర్తిస్థాయిలో ప్రారంభమయ్యాయి. రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై పనులు చేస్తున్నారు. వాగులు, వంకల నుంచి చెరువుల్లో నీరు చేరింది. చెరువులు నిండుకుండల్లా తయారయ్యాయి. జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదయ్యింది. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రానికి సగటున 10.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. ఖరీఫ్ ప్రారంభమైన జూన్ 1 నుంచి నేటికి 558.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవ్వగా సగటు వర్షపాతం 472.3 మిల్లీమీటర్లుగా ఉంది.

శుక్రవారం వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం మి.మీ.లో
కె.కోటపాడు	23.4
పాయకరావుపేట	19.6
మాకవరపాలెం	18.2
చోడవరం	15.2
నక్కపల్లి	14.4
రావికమతం	13.3
యలమంచిలి	13.3
అనకాపల్లి	13.0
కశింకోట	11.2
కోటవురట్ల	10.7
నాతవరం	10.2

శ్రావణ లక్ష్మి.. సౌభాగ్య ప్రదాయిని



సత్యనారాయణపురం గ్రామంలో కనకదుర్గ అమ్మవారు

శ్రావణమాసం నాలుగో శుక్రవారం సందర్భంగా జిల్లా అంతటా ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది. మహిళలు లక్ష్మీదేవికి పూజలు చేశారు. దేవాలయాల్లో సామూహికంగా కుంకుమ పూజలు నిర్వహించారు. ఉత్తరాంధ్రుల ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి దేవాలయంలో వరలక్ష్మీదేవి పూజలు ఘనంగా జరిగాయి. అమ్మవారి బాలాలయంలో సామూహిక వరలక్ష్మీదేవికి వ్రతాలు ఘనంగా జరిగాయి. సతకంపట్టు కనకదుర్గ అమ్మవారు, గవరపాలెం సంతోషిమాత అమ్మవారు, సత్యనారాయణపురం కనకదుర్గ అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి. - అనకాపల్లి



అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు

మొక్కలు నాటి సంరక్షించాలి

- వన మహోత్సవంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు

అనకాపల్లి: ప్రతి ఒక్కరూ కనీసం మూడు మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కోరారు. వన మహోత్సవం–2024 కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డులో ఆయన శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ ఇటీవల కాలంలో 60 లక్షల మొక్కలు నాటినట్టు అధికారులు చెబుతున్నారని, క్షేత్ర స్థాయిలో చూస్తే భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయని చెప్పారు. జిల్లాలో 4 లక్షల మంది డ్వాక్రా మహిళలను మొక్కల పెంపకంలో భాగస్వామ్యం చేయాలన్నారు. శాస్త్రవేత్తలు వద్దని సూచిస్తున్న పలు జాతుల మొక్కలను నాటవద్దని చెప్పారు. అన్ని కళాశాలల్లో మొక్కలు పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. రహదారుల విస్తరణ సమయంలో చెట్లు నరికితే.. వాటిని తిరిగి పెంచేందుకు ప్రత్యేకంగా రోడ్డు పనిలోనే నిధుల కేటాయింపు జరిగేలా జిల్లా నుంచే శ్రీకారం చుట్టాలని ఆయన సూచించారు. కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో 60 లక్షల మొక్కలు నాటామని, భవిష్యత్తులో విరివిగా మొక్కలు నాటేందుకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. అనకాపల్లి, యలమంచిలి ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయకుమార్, డీఎఫ్‌వో జగన్నాథ్‌సింగ్, అటవీ శాఖ అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటి నీరుపోస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కలెక్టర్ విజయ కృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

ఉద్యోగాల పేరిట గృహిణులకు టోకరా

మల్కాపురం: హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఎం అండ్‌డబ్ల్యూ(హ్యూమన్ యూనిక్ గోల్స్) అనే సంస్థ పేరిట జీవనోపాధి కల్పిస్తానని గృహిణులు, మహిళలను మోసం చేశాడు. దీంతో బాధితులు శుక్రవారం ఐదో పట్టణ పోలీసులకు ఆయనపై ఫిర్యాదు చేశారు. వివరాలివీ.. హైదరాబాద్‌కు చెందిన మాచర్ల జగన్నాథం గౌడ అనే వ్యక్తి రామా టాకీస్ ప్రాంతంలోని ఉంటూ.. రెడ్డి కంచరపాలెంలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని గృహిణులు, మహిళలను టార్గెట్ చేశాడు. తనకి చాలా వ్యాపారాలు ఉన్నాయని.. ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. సుమారు 350 మహిళల నుంచి రూ.1,300 చొప్పున సేకరించాడు. మహిళలను వారి అర్హతను బట్టి మేనేజర్, కంప్యూటర్ ఆపరేటర్, తదితర విభాగాల్లో చేర్పించుకున్నాడు. కేంద్ర ప్రభుత్వ పథకాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించాడు. కొన్ని రోజులు ఎవరికి అనుమానం రాకుండా సంస్థను నడిపాడు. తర్వాత ఇంటి యజమానికి అద్దె చెల్లించి గుట్టుచప్పుడు కాకుండా ఉడాయించాడు. ఇదంతా జూలైలో జరిగింది. ఆ తర్వాత అతని గురించి వాకబు చేసిన మహిళలు, గృహిణులు.. తమను మోసం చేశాడని గ్రహించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక నుంచి.. ఇంధనం వరకు..

- ప్రతి వస్తువు నాణ్యతా పరిశీలించేలా..
- ఎక్స్‌ఆర్‌డీ ఎనలైటికల్ ల్యాబ్ ప్రారంభించిన పెట్రోలియం యూనివర్సిటీ
- ప్రతి మెటీరియల్ గుర్తింపు, నాణ్యతకు సహాయకారిగా ల్యాబ్
- వస్తువు ఎలా ఏర్పడింది.? దేనికి ఉపయోగించవచ్చనే అంశాలూ తెలిపేలా రిపోర్ట్
- ఎస్‌బీఐ ఫౌండేషన్ సహకారంతో రూ.3.94 కోట్లతో ఏర్పాటు
- ఏపీలో ఎక్స్‌ఆర్‌డీ ల్యాబ్ ఏర్పాటు చేసిన తొలి ఇన్‌స్టిట్యూట్‌గా ఐఐపీఈ

సాక్షి, విశాఖపట్నం : ఇసుక రేణువు చిన్నదే.. దాని నాణ్యత తెలుసుకోవాలంటే చాలా కష్టం.? అది ఎలా ఏర్పడిందో కనుగొనాలంటే మరింత పరిశోధనలు చెయ్యాల్సిందే. కానీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ)లో ఏర్పాటు చేసిన ఎక్స్‌ఆర్‌డీ ఎనలైటికల్ ల్యాబ్ ద్వారా చాలా సులువు. ఇసుక నుంచి ఇంధనం వరకూ ప్రతి వస్తువు నాణ్యత, పూర్వాపరాలు తెలుసుకునేందుకు రాష్ట్రంలోనే తొలి ల్యాబ్ సేవలు ఇక్కడ మొదలయ్యాయి.

ఎక్స్‌ఆర్‌డీ ల్యాబ్ అంటే.. ఎక్స్‌రే డీ ఫ్రాక్టోమీటర్ ఎనలైటికల్ ల్యాబ్. ఇది స్ఫటిక పదార్థాల భౌతిక లక్షణాలు, వాటి నిర్మాణం, దిశ దశ, కూర్పును అధ్యయనం చేసేందుకు సులువైన ల్యాబ్. ఎక్స్-కిరణాలను ఉపయోగించే నాన్-డిస్ట్రక్టివ్ ఎనలిటికల్ టెక్నిక్‌తో ప్రతి వస్తువు తాలుక వివరాలను నివేదిక రూపంలో వెల్లడిస్తుంది. సోలార్, హైడ్రోజన్ ఎనర్జీ మెటీరియల్స్ ఉత్పత్తి, రవాణా, స్టోరేజీకి ఈ పరిశోధనా కేంద్రం కీలకం కానుంది. కార్బన్ క్యాప్చర్ యుటిలైజేషన్ అండ్ స్టోరేజ్ (సీసీయూఎస్) రంగంలో పరిశోధనలో కూడా ఎక్స్‌ఆర్‌డీ ల్యాబ్ ముఖ్య భూమిక పోషించనుంది.



ల్యాబ్ ప్రారంభిస్తున్న ఎస్‌బీఐఎఫ్ ఎండీ సంజయ్ ప్రకాష్, ఐఐపీఐ డైరెక్టర్ ప్రొ.శాలివాహన్

ఏం చేస్తారంటే.??

ఉదాహరణకు ఎర్రమట్టి దిబ్బలు ఇసుకతో తయారయ్యాయని అందరికీ తెలుసు. కానీ ఇసుక ఎందుకు ఎర్రగా మారింది.? బీచ్‌లో ఉండే ఇసుకకు, ఎర్రమట్టి దిబ్బల ఇసుకకు ఉన్న వ్యత్యాసమేంటి.? ఏ మెటీరియల్ ద్వారా ఇలా మారింది.. ఇలా ప్రతి విషయాన్ని విపులంగా ఈ ల్యాబ్ ద్వారా తెలుసుకోవచ్చు. ప్రపంచంలో దొరికే ఏ మెటీరియల్ అయినా.. అది పౌడర్, ఇసుక, కెమికల్స్.. థిన్ ఫిల్మ్, హై టెంపరేచర్.. ఏ రూపంలో ఉన్నా దాని వివరాల్ని ఈ టెస్టింగ్ ల్యాబ్ ద్వారా తెలుసుకోవచ్చు. క్వార్ట్ రాయిని టెస్ట్ చేసి దాని క్రిస్టల్ స్ట్రక్చర్ ద్వారా ఏ రాయి దేనికి ఉపయోగపడుతుందనేది ఈ ల్యాబ్ రిపోర్ట్స్ స్పష్టం చేస్తాయి.



టోటల్ ఆర్గానిక్ కార్బన్ అనలైజర్

ఈ టీవోసీ ద్వారా 720 డిగ్రీల ఉష్ణోగ్రతలోనూ ఆర్గానిక్ కార్బన్‌ని సీవో2గా మార్చగలదు. ఈ యంత్రం ద్వారా తాగునీటిలో ఉన్న కలుషితాల్ని కనుగొనవచ్చు. సెమికండక్టర్ల తయారీలో వాడే నీటివివరాల్ని కనుక్కోవచ్చు.



ఎస్ఎస్ఎంతో..

ఘన పదార్థాల రూపంలో ఉన్న వస్తువుల వివరాల్ని శోధించేందుకు ఎస్ఎస్ఎం మిషన్ ఉపయోగపడుతుంది. 30 నుంచి 40 నిమిషాల్లో 900 డిగ్రీల ఉష్ణోగ్రతకు చేరుకునే వ్యవస్థ ఇందులో ఉంటుంది.

అన్ని రంగాలకు ఉపయోగపడేలా..

ఇది కేవలం ఇంధన రంగంలో పరిశోధనలకు మాత్రమే కాకుండా అన్ని సెక్టార్లకు సంబంధించిన పరిశోధనల ఫలితాలను అందించగలదు. జియాలజీ, ఫార్మాస్యుటికల్స్.. ఇలా భిన్నమైన రంగాల్లో వినియోగించే మెటీరియల్ వివరాల్ని అందించే అత్యాధునిక ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా రసాయనాల టెస్టింగ్‌కు అత్యంత కీలకంగా పని చేస్తుంది. కెమికల్ ఎలా ఏర్పడిందో తెలుసుకొని దానిలో ఏ తరహా కెమికల్ కలపొచ్చు.. దాని ద్వారా ప్రమాదాలు తలెత్తవనే వివరాల్ని సేకరించడం ఈ ల్యాబ్ ద్వారా సులువవుతుంది. వస్తువుల క్వాలిటీ కంట్రోల్ ఎనాలసిస్‌లో ఎక్స్ ఆర్‌డీ ల్యాబ్ రాష్ట్రంలోనే కీలకంగా మారనుంది.

ఎక్స్‌రే డిఫ్రాక్షన్ మెషీన్‌తో..



ఈ మెషీన్‌లో ఏ పదార్థం తాలుక నిర్మాణం, వ్యవస్థను కనుక్కోవాలో దాన్ని ఇందులో ఉంచుతారు. మెషీన్‌లో వెలువడే ఎక్స్ కిరణాల సాయంతో పదార్థానికి సంబంధించిన పూర్తి సమాచారం డిస్‌ప్లే అవుతుంది.

ఏపీలో తొలి యూనివర్సిటీగా..

ఎస్‌బీఐ ఫౌండేషన్ అందించిన రూ.3.94 కోట్ల సీఎస్సార్ నిధులతో ఐఐపీఈలో ఈ ల్యాబ్‌ని గురువారం ఎస్‌బీఐఎఫ్ ఎండీ సంజయ్ ప్రకాష్, ఐఐపీఈ డైరెక్టర్ ప్రొ.శాలివాహన్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ ప్రొ.విజయ్‌కుమార్ తదితరులు కలిసి ప్రారంభించారు. దేశంలో కేవలం మూడు యూనివర్సిటీల్లో మాత్రమే ఈ ల్యాబ్ ఉండగా.. ఏపీలో తొలి యూనివర్సిటీగా ఐఐపీఈ చరిత్ర సృష్టించింది.

ఫార్మా ప్రమాద బాధితులకు వైఎస్సార్‌సీపీ బాసట

- మృతుల కుటుంబాలకు నేడు రూ.5 లక్షల చొప్పున పంపిణీ



చిరంజీవి (ఫైల్)



నాగేశ్వరరావు(ఫైల్)

నక్కపల్లి: పొట్టకూటి కోసం ఊరు కాని ఊరెళ్లి అక్కడ ఉపాధి పొందుతున్న కంపెనీ దుర్ఘటనలో మరణిస్తే, వారిపై ఆధారపడిన కుటుంబాల బతుకు ఎంత దుర్భరంగా ఉంటుందో ఊహాకందనిది. రాంబిల్లి మండలంలోని ఒక రసాయన పరిశ్రమ ప్రమాదంలో 17 మందికిపైగా కార్మికులు, ఉద్యోగులు దుర్మరణం పాలైన విషయం విదితమే. వీరిలో ఎస్. రాయవరం మండలానికి చెందిన ఇద్దరు కార్మికుల కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ బాసటగా నిలిచింది. పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన ఆర్థిక సాయాన్ని శాసన మండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ శనివారం రూ.5 లక్షల చొప్పున చెక్కులు పంపిణీ చేయనున్నారు. ఎస్. రాయవరం మండలం దార్లపూడికి చెందిన జవ్వాది చిరంజీవి(25)కి నాలుగు నెలల క్రితమే వివాహమైంది. అతడి భార్య గర్భిణి, తండ్రి లేడు, తల్లి మాత్రమే ఉంది. ఇతని సంపాదనపైనే కుటుంబం ఆధారపడి జీవిస్తోంది. రాంబిల్లి ఫార్మా కంపెనీ ప్రమాదంలో చిరంజీవి మృత్యువాత పడటంతో కుటుంబం రోడ్డున పడింది. అలాగే బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన పూసర్ల నాగేశ్వరరావుది కూడా పేద కుటుంబమే, తండ్రి ఆటో నడుపుతూ.. తల్లి టైలరింగ్ పనులు చేస్తూ కుమారుడిని చదివించి ప్రయోజకుడిని చేశారు. ఫార్మా ప్రమాదం వీరికి పుత్రశోకాన్ని మిగిల్చింది. తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటూ అమ్మా నేను సంపాదిస్తున్నాను.. ఇంక ఎంతకాలం మీరు కష్టపడతారు.. చక్కగా ఇంటి పట్టునే ఉండండని చెప్పేవాడని, చేతికందొచ్చిన ఒక్కగానొక్క కొడుకు మృత్యువాత పడటంతో వీరి వేదన వర్ణనాతీతంగా మారింది. ఈ ప్రమాద సమయంలో వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ బాధిత కుటుంబాలను పరామర్శించడంతోపాటు, మరణించిన వారి కుటుంబాలను ఆదుకుంటామని, అండగా నిలుస్తామని ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం పార్టీ తరపున రూ.5 లక్షల చొప్పున సాయం అందజేస్తారని పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు తెలిపారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మండలానికి చెందిన ముఖ్య నాయకుల సమక్షంలో బాధిత కుటుంబాల ఇళ్లకెళ్లి అందజేస్తారన్నారు.

రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం



వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

అనకాపల్లి: జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు ఎక్కువగా ఉంటాయని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. స్థానిక గవరపాలెం రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి 11వ సబ్ జూనియర్, జూనియర్ అండ్ సీనియర్ (స్త్రీ, పురుషుల) వెయిట్ లిఫ్టింగ్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థి దశ నుంచి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. జిల్లాలో క్రీడా కోటలో అనేక మంది ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. మూడు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహించనున్నారు. అనకాపల్లి, యలమంచిలి ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయకుమార్, రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి తిప్పాని దీన్‌షాబాబు, ఉపాధ్యక్షుడు గుమ్మాల వెంకటరామ(రాము), ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు కె.సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

నానో టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు



నానో టెక్నాలజీ జాతీయ వెబినార్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, అధ్యాపకులు



నానో టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిపుణుడు డాక్టర్ వెంకటరమణ

- హైదరాబాద్ నానో స్పేస్ కంపెనీ కో డైరెక్టర్ డాక్టర్ వెంకటరమణ

యలమంచిలి రూరల్: నానో టెక్నాలజీతో పలు రంగాల్లో శాస్త్ర పరిశోధనల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని హైదరాబాద్ నానో స్పేస్ కంపెనీ కో డైరెక్టర్ డాక్టర్ జి. వెంకటరమణ తెలిపారు. శుక్రవారం యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్ డిపార్టుమెంట్ల విద్యార్థులకు జాతీయ వెబినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ పి. చంద్రశేఖర్ అధ్యక్షోపన్యాసం చేశారు. ప్రపంచంలో నానో టెక్నాలజీ ద్వారా ఎన్నో ప్రయోజనాలున్నాయని, దీనిపై విద్యార్థులంతా అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం హైదరాబాద్ నానో స్పేస్ కంపెనీ కో డైరెక్టర్ విద్యార్థులకు నానో టెక్నాలజీతో భవిష్యత్తులో ఎలాంటి ఉపయోగాలుంటాయి, ఉపాధి అవకాశాలు పొందడానికి దీని వల్ల ఎంత మేలు కలుగుతుంది అనే అంశాలను వివరించారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్, వైద్య రంగాల్లో అతి చిన్న సైజులో కావాల్సిన పదార్థాలను తయారు చేసుకునే వీలుంటుందన్నారు. నానో రోబోట్స్‌ను శరీరంలోకి పంపినప్పుడు అవి సులువుగా అసాధారణ కణాల ఉనికిని గుర్తిస్తాయన్నారు. ఫలితంగా సులభంగా వైద్య చికిత్స చేయవచ్చన్నారు. 2004 నుంచి భారతదేశంలో నానో ప్రాజెక్టుల రూపకల్పన ప్రారంభమైందన్నారు. ప్రస్తుతం అన్ని రంగాల్లో విరివిగా ఉపయోగిస్తున్నారని చెప్పారు. నానో టెక్నాలజీకి సంబంధించి విద్యార్థులడిగిన పలు సందేహాలను ఆసక్తికరమైన ఉదాహరణలతో నివృత్తి చేశారు. తెలుగు రాష్ట్రాల్లో వివిధ కళాశాలలకు చెందిన పలువురు విద్యార్థులు పాల్గొన్న వెబినార్‌లో ఫిజికల్ డాక్టర్ పోలిరెడ్డి, భౌతికశాస్త్ర అధ్యాపకుడు పీఎస్ జగ్గారావు, కే వెంకన్న, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు సాయిచరణ్, ఎస్పీ దేవి పాల్గొన్నారు.

పేద కుటుంబానికి విశ్రాంత ఎంఈవో చేయూత

- తన పెన్షన్‌లో ప్రతి నెలా రూ.వెయ్యి సాయం



అప్పలకొండకు నగదు నిత్యావసర సరుకులు అందజేస్తున్న విశ్రాంత ఎంఈవో అమృత్‌కుమార్, సర్పంచ్ నాగమణి

నాతవరం: పేద కుటుంబాన్ని ఆర్థికంగా అదుకోవడానికి విశ్రాంత ఎంఈవో తాడి అమృత్‌కుమార్ ముందుకు రావడం అభినందనీయమని ఎం.బెన్నవరం సర్పంచ్ మార్తి నాగమణి అన్నారు. ఎం.బెన్నవరం పంచాయతీ శివారు ములగపూడి గ్రామానికి చెందిన గడమాల అప్పలకొండ ఇటీవల చెట్టుపై నుంచి జారిపడి వెన్నుపూస దెబ్బతినడంతో మంచానికే పరిమితమయ్యాడు. వైద్యులు శస్త్రచికిత్స అనంతరం అప్పలకొండ కూలి పనులు చేయలేడని నిర్ధారించారు. అసలే రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి. ఈ స్థితిలో అతని కుటుంబం మరింత ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. విషయం తెలుసుకున్న విశ్రాంత ఎంఈవో తాడి అమృత్‌కుమార్ శుక్రవారం అప్పలకొండకు 50 కేజీలు బియ్యం, నిత్యవసరకులు రూ.1000 నగదు ఏర్పాటు చేశారు. వాటిని శుక్రవారం అమృత్‌కుమార్ సర్పంచ్ మార్తి నాగమణి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌తో కలిసి అప్పలకొండ ఇంటికి వెళ్లి అందజేశారు. తనకు ప్రతి నెలా వచ్చే పెన్షన్‌లో ఈనెల నుంచి రూ.1000 చొప్పున అప్పలకొండకు అందజేస్తానని అమృతకుమార్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మార్తి చిన్నారావు, ఎస్సీ కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

రెండు ఆలయాల్లో హుండీలు చోరీ



ఎరకాలమ్మ ఆలయంలో చోరీకి గురైన హుండీ



సాయిబాబా మందిరంలో ధ్వంసం చేసిన హుండీ

దేవరాపల్లి: మండలంలోని రైవాడ గ్రామంలోని రెండు ఆలయాల్లో హుండీలు గురువారం అర్ధరాత్రి చోరీకి గురయ్యాయి. ఇక్కడ జలాశయం సమీపంలోని గ్రామ దేవత ఎరకాలమ్మ ఆలయంతోపాటు, షిర్డీ సాయిబాబా మందిరంలో గుర్తు తెలియని వ్యక్తులు గేట్లు తాళాలను పగులకొట్టి ప్రవేశించారు. అనంతరం హుండీల తాళాలను పగులకొట్టి వాటిలో నగదు ఎత్తుకుపోయారు. రూ.10 వేల మేర చోరీ చేసి ఉంటారని గ్రామస్తులు అంచనా వేస్తున్నారు.

క్రిమిసంహారక మందు తాగి యువకుడి మృతి

గొలుగొండ: మండలంలో ఏఎల్‌పురం గ్రామానికి చెందిన వి. మహేష్(33) క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు కృష్ణదేవిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గ్రామానికి చెందిన మహేష్ గురువారం రాత్రి క్రిమిసంహారక మందు సేవించడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండటంతో శుక్రవారం విశాఖ తరలిస్తుండగా, మార్గమధ్యలో మాకవరపాలెం వద్ద చనిపోయాడు. మృతదేహానికి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అతడు మృతికి కారణాలు తెలియరాలేదని, కేసు విచారణ చేసి పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్‌ఐ ఉపేంద్ర తెలిపారు.

నేడు సామాజిక పింఛన్ల పంపిణీ

తుమ్మపాల: సామాజిక పింఛన్లను ఒకరోజు ముందుగానే ఈనెల 31వ తేదీ శనివారం ఉదయం 6 గంటల నుంచి ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయడానికి అన్ని చర్యలు చేపట్టినట్టు కలెక్టర్ విజయ కృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం సెలవు రోజు కావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు.

అయ్యప్ప భక్తులకు శుభవార్త

- విశాఖ-కొల్లాం మధ్య వీక్లీ స్పెషల్ రైలు

తాటిచెట్లపాలెం: అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేరు డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. విశాఖపట్నం-కొల్లాం(08539) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ బుధవారం ఉదయం 8.20 గంటలకు విశాఖలో బయలుదేరి గురువారం మధ్యాహ్నం 12.55 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. ఈ స్పెషల్ సెప్టెంబర్ 4 నుంచి నవంబరు 27వ తేదీ వరకు నడుస్తుంది. కొల్లాం-విశాఖపట్నం (08540) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ గురువారం రాత్రి 7.35 గంటలకు కొల్లాంలో బయలుదేరి శుక్రవారం రాత్రి 11.20 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ స్పెషల్ సెప్టెంబరు 5 నుంచి నవంబర్ 28వ తేదీ వరకు నడుస్తుంది. అయ్యప్ప మాలధారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని డీసీఎం కోరారు.

మరికొంత కాలం ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం(విశాఖ): దసరా, దీపావళి పండగల నేపథ్యంలో ప్రత్యేక రైళ్లను మరికొంత కాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు.

- విశాఖపట్నం-చెన్నై ఎగ్మోర్ (08557) పూజా స్పెషల్ శనివారాల్లో రాత్రి 7 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.45 గంటలకు చెన్నై ఎగ్మోర్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ సెప్టెంబర్ 7 నుంచి నవంబర్ 30వ తేదీ వరకు నడుస్తుంది. చెన్నై ఎగ్మోర్-విశాఖపట్నం (08558) పూజా స్పెషల్ ఆదివారాల్లో ఉదయం 10.30 గంటలకు చెన్నై ఎగ్మోర్‌లో బయలుదేరి అదే రోజు రాత్రి 10.35 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ సెప్టెంబర్ 8 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు నడుస్తుంది.
- విశాఖపట్నం- సికింద్రాబాద్(08579) వీక్లీ స్పెషల్ విశాఖలో బుధవారాల్లో రాత్రి 7 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.05 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ వీక్లీ స్పెషల్‌ను నవంబర్ 27 వరకు పొడిగించారు. సికింద్రాబాద్-విశాఖపట్నం (08580) వీక్లీ స్పెషల్ సికింద్రాబాద్‌లో గురువారాల్లో రాత్రి 7.40 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ నవంబరు 28 వరకు పొడిగించారు.

విశాఖపట్నం-తిరుపతి(08583)వీక్లీ స్పెషల్ విశాఖలో ప్రతీ సోమవారం రాత్రి 7 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు నవంబర్ 25 వరకు పొడిగించారు. తిరుపతి-విశాఖపట్నం(08584) స్పెషల్ తిరుపతిలో మంగళవారాల్లో రాత్రి 9.55గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 10.15గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు నవంబరు 26 వరకు పొడిగించారు.

కేజీహెచ్‌లో 12 ఏళ్ల బాలికకు అరుదైన చికిత్స

మహారాణిపేట: కేజీహెచ్‌లో 12 ఏళ్ల బాలికకు వైద్యులకు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం ఆ బాలిక ఎండోక్రినాలజీ విభాగంలో చికిత్స పొందుతోంది. సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపిన వివరాలివీ.. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు ప్రాంతానికి చెందిన 12 ఏళ్ల బాలిక ఒక్కసారిగా బరువు పెరగడం, ఆయాసం, అధిక ఆకలి, దాహం, అతి మూత్రం, తలపై జుట్టు రాలటం, మిగతా శరీర భాగాల్లో అధికంగా జుట్టు పెరగడం, ముఖం వాపు తదితర లక్షణాలతో బాధపడుతోంది. ఈ నెల 3న బాలికను ఆమె తల్లిదండ్రులు కేజీహెచ్‌కు తీసుకొచ్చారు. పిల్లల సర్జరీ వార్డులో ఆమెను చేర్పించి.. ఆ విభాగం అధిపతి డాక్టర్ జి.రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో చికిత్స అందించారు. బాలికకు అధిక రక్తపోటు, వీపు మీద భాగాల్లో అధికంగా కొవ్వు చేరడం, చర్మం మీద మచ్చలు, ముఖం ఉబ్బి ఉండడం వంటి లక్షణాలను గుర్తించి 'కుషింగ్స్ సింద్రోమ్'గా నిర్ధారించారు. బాలికకు రక్త పరీక్షలు, స్కానింగ్ చేసి.. ఎడమ మూత్రపిండం పైభాగంలోని అడ్రినల్ గ్రంథిలో 3, 3 సెంటీమీటర్ల పరిమాణంలో కణితి ఉన్నట్లు నిర్ధారించారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో బాలిక మెదడులోని నాళాల్లో రక్తం గడ్డ కట్టి, ఫిట్స్ రావడం, స్పృహ కోల్పోవడంతో పలు విభాగాల వైద్యులు వెంటిలేటర్‌పై ఆమెకు చికిత్స అందించారు. ఈ క్రమంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ భాస్కర రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 27న లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్స విధానం ద్వారా కణితిని తొలగించారు. శస్త్ర చికిత్స అనంతరం బాలిక ఆరోగ్యం పూర్తిగా మెరుగుపడింది. రక్తపోటు సాధారణ స్థితికి చేరింది. సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ శుక్రవారం బాలికను పరామర్శించి.. ఆమెకు చికిత్స అందించిన వైద్యులు కె.ఎ.వి.సుబ్రహ్మణ్యం, రాజేంద్రప్రసాద్, డాక్టర్ భాస్కరరెడ్డి, హసంతి, కల్యాణ్, శ్రీనివాస్, ప్రవీణ్, నాగరాజు, జూనియర్ వైద్యులను అభినందించారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



డిపో వద్ద ధర్నా చేస్తున్న ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లి: ప్రజారవాణా శాఖ(ఆర్టీసీ)విజయవాడ డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ అండ్ అకౌంట్స్ వైఖరికి నిరశనగా ప్రజారవాణా శాఖ నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక డిపో వద్ద శుక్రవారం ఉద్యోగులు నల్లబ్యాడ్జిలు ధరించి విధులకు హాజరై, మధ్యాహ్నా భోజన విరామ సమయంలో డిపో గేటు వద్ద ధ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ కండక్టర్లు, డ్రైవర్లకు నైట్ అవుట్ అలవెన్స్‌లు పునఃరుద్ధరించాలని, జీవో నం.114లోని అలవెన్సులను అమలు చేయాలని, రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యూటీ, ఆర్జిత సెలవుల బకాయిలు చెల్లించాలని, పీటీడీ సర్వీసులో ఉన్న ఉద్యోగుల వేతన బకాయిలు , ఎరియర్స్ చెల్లించాలని, సర్వీసులో మృతి చెందిన ఉద్యోగులకు అంత్యక్రియలు నిమిత్తం రూ. 25వేలు ట్రెజరీ ద్వారా చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. నిరసనలో రీజనల్ సహాయ కార్యదర్శి ఎల్.వి.ఆర్.బాబు, జిల్లా ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్యదర్శి పి.ఎస్.వి.పరమేశ్వరరావు, డిపో అధ్యక్షుడు ఎ.ఎస్.రావు, కార్యదర్శి వేపాడ శ్రీనువాసరావు, కోశాధికారి ఎం.బి.రాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

తుమ్మపాల: ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజనలో భాగంగా రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ ఐ.వి.ఎస్.ఎస్. శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి నుంచి డిగ్రీ పూర్తి చేసిన మహిళలు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు కళాశాలలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7013342667 సంప్రదించాలని కోరారు.

వినాయక పందిళ్లకు అనుమతి తప్పనిసరి

అనకాపల్లి: వినాయక నవరాత్రులను పురస్కరించుకుని పట్టణంలోని అన్ని వీధిల్లో ఏర్పాటు చేసే పందిళ్లకు కమిటీ సభ్యులు పోలీస్ సింగిల్ విడో ఆన్‌లైన్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో వినాయక నవరాత్రులు నిర్వహించుకునేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వినాయక మండపాల నిర్వహకులు httpr://fa nerh utra.a ppo ice.gov.in లేదా 7995095800 నంబర్ ద్వారా రిజిస్ట్రేషన్ అయ్యి పర్మిషన్ తీసుకోవాలని సూచించారు.

చక్కెర కర్మాగారాలను తెరిపించాలని డిమాండ్

అనకాపల్లి: జిల్లాలో మూతపడిన తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ చక్కెర కర్మాగారాలను తెరిపించి చెరకు రైతులకు భరోసా కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో వరి పంట తర్వాత రెండో ప్రధాన పంట చెరకు సాగు తగ్గడం ఆందోళన కలిగిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు ఫ్యాక్టరీల క్రషింగ్ నిలిపివేయడంతో చెరకు సాగుపై రైతులు ఆసక్తి చూపడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది 47 వేల ఎకరాల్లో సాధారణ సాగు విస్తీర్ణానికి ఇప్పటివరకు 13,735 ఎకరాల్లో రైతులు చెరకు సాగు చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా మూడు చక్కెర కర్మాగారాలను ఆధునీకీకరించాలని కోరారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆధునికీకరించి క్రషింగ్ సామర్థ్యాన్ని పెంచాలని, రైతుల పెట్టుబడులకు అనుగుణంగా మద్దతు ధర, ప్రోత్సాహక ధర చెల్లించాలన్నారు. క్రషింగ్ నిలిపివేసిన మూడు ఫ్యాక్టరీల ప్రాంతాల్లో చెరకు సాగు తగ్గిందని, పొలాల్లో ఆహారేతర పంటలు పండించుకోవల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఫ్యాక్టరీలను తెరిపించి రైతులను ఆదుకుంటామని గతంలో ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 48 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	---	---
రెండో రకం	3,430	3,920
మూడోరకం	3,000	3,300

అనకాపల్లి సినిమాలు

మారుతీనగర్ సుబ్రమణ్యం : రాజా(మార్నింగ్, ఫస్ట్‌షో)
మిస్టర్ బచ్చన్ :రాజా(మ్యాట్నీ, సెకండ్‌షో)
తంగలాన్ : సత్యనారాయణ స్క్రీన్-1
కమిటీ కుర్రోళ్లు :సత్యనారాయణ స్క్రీన్-2
సింబా :పర్తిసాయి
శ్రీలక్ష్మీనరసింహ(జ్యోతి)జామి:షిర్డీసాయి
డబుల్ ఇస్మార్ట్ : వెంకటేశ్వర
నేను కీర్తన : శ్రీసత్య
డిమోంటి కాలనీ2: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 35 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-14 యూనిట్లు, ఓ పాజిటివ్-18 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి :ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 237 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 169 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

ఉచిత ఇసుక ఉత్తుత్తిదే..

- రూ.9 వేలకూ దొరకని ట్రాక్టర్ లోడు
- ప్రజలకు చంద్రబాబు సర్కార్ మస్కా
- నిలిచిన భవన నిర్మాణాలు
- పనులు లేక భవన కార్మికుల పస్తులు



కూటమి ప్రభుత్వంలో ఖరీదవుతున్న ఇసుక

ఎన్నికల ముందు ఉచితంగా ఇసుక ఇస్తామని ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు కిలోమీటరుకు ఖరీదు కట్టి అమ్ముతోంది. భవన నిర్మాణదారుల నుంచి డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని కృత్రిమ కొరత సృష్టించి సొమ్ము చేసుకుంటోంది. దీంతో రెండు నెలలుగా భవన నిర్మాణాలు నిలిచిపోగా, పనులు లేక కార్మికులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

తుమ్మపాల: ఆధునిక సమాజంలో ప్రతి దానికి ఒక రేటుంది. కంటికి కనబడే వస్తువులతో పాటు కనబడని సేవలకు రేట్లు ఉన్న సంగతి అందరికీ తెలిసిందే. అయితే ప్రకృతిలో ఉచితంగా పొందే గాలి, నీరు తోపాటు నేల, మట్టికి కూడా ధరలు కేటాయించి ప్రజలు నుంచి వసూలు చేస్తే గాని ప్రభుత్వాలు నడవని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో సహజ వనరులైన మట్టి, ఇసుకను సైతం టెండర్లు వేసి భారీ ధరలకు అమ్మేస్తున్నాయి. ఒకప్పుడు మైనింగ్ ద్వారా ఆదాయం సమకూర్చేవి. ఇప్పుడు ఇసుకపైనే ఆధారపడి నడుపుకొస్తున్నాయి. నిబంధనలను సైతం మార్చేసి నదీ గర్భాల నుంచి ఇసుకను వేల టన్నుల కొద్దీ తోడేస్తూ పక్క రాష్ట్రాలకు తరలించేస్తున్నాయి. దీంతో ఇసుక డిమాండ్ పెరగడంతో నదీ తీరాలకు దూరంగా ఉన్న ప్రాంతాల్లో భవన నిర్మాణాలకు అందుబాటులో లేకుండా పోయింది. ఇసుక దొరక్క భవన నిర్మాణ కార్మికులు కూడా పనులు లేక పస్తులుంటున్నారు.

◆ ఇసుక కృత్రిమ కొరత సృష్టించి..

నూతన జిల్లా కేంద్రమైన అనకాపల్లి పట్టణంతో పాటు మండలం దినదినాభివృద్ధి చెందుతోంది. దీంతో ప్రతి చోట భవనాల నిర్మాణాలు సంఖ్య పెరుగుతూనే ఉంది. రోజూ పట్టణంలో దాదాపు వెయ్యికి పైగా భవన నిర్మాణ కార్మికులు పనులు చేస్తున్నారు. మండలంలో అన్ని గ్రామాల్లో పదుల సంఖ్యలో భవనాలు నిర్మిస్తున్నారు. ఈ పనులన్నీ రెండు నెలలుగా ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అందరికీ ఉచిత ఇసుక అంటూ బూటకపు హామీ ఇవ్వడంతో భవన నిర్మాణ యాజమానులు వేచి చూస్తున్న క్రమంలో ఉచితమన్న పదానికి అర్థం మార్చేసింది. ఇసుక ధరలు కేటాయించింది. జిల్లాకో స్టాక్ యార్డ్ పెట్టి ఇసుక కృత్రిమ కొరత సృష్టించింది. భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా చేసింది. దీంతో కార్మికులు ఇళ్లకే పరిమితమై ఖాళీగా ఉంటున్నారు.

◆ వైఎస్సార్‌సీపీ హయాంలో ట్రాక్టర్ ఇసుక రూ.5 వేలకే..

చంద్రబాబు బూటకపు హామీలతో ప్రజలు ప్రతి ఐదేళ్లకొకసారి మోసపోతూనే ఉంటున్నారు. 2014-19 టీడీపీ ప్రభుత్వంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి నెరవేర్చిన పాపాన పోలేదు. దీంతో అనేక వర్గాలు ఆర్థికంగా చితికిపోయాయి. మళ్లీ ఇప్పుడు అంతకుమించిన హామీలతో మరోసారి మోసం చేస్తున్నారు. ఉచిత ఇసుక అంటూ ఈసారి ప్రజల చెవిలో పువ్వు పెడుతున్నారు. స్టాక్ యార్డ్‌ల వద్ద లోడింగ్ పేరుతో టన్నుకు రూ.1,225 వసూలు చేస్తోంది. జిల్లాలో నక్కపల్లి యార్డ్ నుంచి పట్టణం, మండలానికి సరాసరి 50 నుంచి 60 కిలోమీటర్ల దూరం ఉంది. రూ.9 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చు పెట్టినా సరే ట్రాక్టర్ ఇసుక దొరికే పరిస్థితులు లేవు. ఇప్పుడు బుకింగ్ చేసుకుంటే కనీసం నెల రోజుల తర్వాత వచ్చే అవకాశమే ఉంది. మరోవైపు ఇది ఉచితమెలా అవుతుందంటూ భవన యాజమానులు లబోదిబోమంటున్నారు. ఇదే గత వైఎస్సార్‌సీపీ హయాంలో ట్రాక్టర్ ఇసుక రూ.5,500కే దొరికేది.



నిలిచిన భవన నిర్మాణ పనులు

◆ నక్కపల్లి యార్డు నుంచి 20 కి.మీ దాటితే ఉచితంగా.. ఆపై కిలోమీటరుకు కింద విధంగా రవాణా చార్జీలు వసూలు చేస్తున్నారు.

వాహనాలు	టన్నులు	కిలోమీటకు (ధర)
ట్రాక్టర్	4.5	రూ.80
6 టైర్ గూడ్స్	10	రూ.100
10 టైర్ గూడ్స్	18	రూ.140
12 టైర్ గూడ్స్	22	రూ.180
16 టైర్ గూడ్స్	31	రూ.200

◆ పనుల్లేక పస్తులుంటున్న భవన నిర్మాణ కార్మికులు

మండుటెండల్లో సైతం చెమటోడ్చి భవన నిర్మాణ పనులు చేసే కార్మికులు పనుల్లేక పస్తులుంటున్నారు. ఆషాడం మాసం మొదలుకుని పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక లేక భవన యాజమానులు పనులు నిలిపివేశారు. భవన నిర్మాణ మేస్త్రిలకు రోజుకు రూ.వెయ్యి, మగ కూలీకి రూ.750, మహిళ కూలీకి రూ.600 చొప్పున కూలి వస్తుండేది. వీరి ఖర్చులు పోను కనీసం రూ.500 ఇంటికి తీసుకెళ్లేవారు. ప్రస్తుతం పనులు లేక పిల్లల చదువులకు, వ్యవసాయ పెట్టుబడులకు డబ్బులు లేక అప్పుల పాలవుతున్నామని భవన నిర్మాణ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రెండు నెలలుగా పనిలేదు...



నేను భవన నిర్మాణ మేస్త్రిగా పనిచేస్తాను. రోజుకు రూ.వెయ్యి కూలి వచ్చేది. రెండు నెలలుగా భవన నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఆషాడ మాసం అంటూ గత నెలలో పనులు లేవు. శ్రావణమాసం వచ్చింది. ముహూర్తాలతో భవన నిర్మాణాలు ప్రారంభిస్తే ఇసుక లేక పనులు లేవు. దీంతో ఖాళీగా ఉండాల్సి వస్తోంది.

– యర్రంశెట్టి రాము, మేస్త్రి, అనకాపల్లి

సెంట్రింగ్ వేసి వేచి చూస్తున్నాం



నేను భవన నిర్మాణ రంగంలో డెకింగ్, సెంట్రింగ్ మేస్త్రిగా పనిచేస్తున్నాను. సన్‌సైడ్, శ్లాబ్‌లకు డెకింగ్, సెంట్రింగ్ వేశాం. ఇసుక లేక శ్లాబ్ పనులు నిలిచిపోయాయి. మాకు పని లేక ఖాళీగా ఉంటున్నాం. ఇసుక అందుబాటులోకి వస్తే శ్లాబ్‌లు పూర్తవుతాయి. మాకు పని దొరుకుతుంది.

– దువ్వాడ మల్లేష్, సెంట్రింగ్ మేస్త్రి, రేబాక గ్రామం

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



లక్ష్మీదేవిపేటలో ఫ్రైడే - డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్న దొర

అనకాపల్లి: జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జోన్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వి.కె.దొర తెలిపారు. శుక్రవారం స్థానిక లక్ష్మీదేవిపేటలో ఫ్రైడే - డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్న సమయంలో దోమకాటుకు గురై ప్రజలు వ్యాధుల బారినపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వ్యాధుల బారిన పడిన రోగులు సకాలంలో వైద్యుల సూచన మేరకు మందులు వాడాలన్నారు. కాచిచల్లార్చిన నీటిని మాత్రమే తాగాని సూచించారు. పూల కుండీల్లో, వాటర్ ట్యాంకుల్లో నిల్వ నీరు లేకుండా శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ శానిటరీ సిబ్బంది ఎం.అప్పారావు, డి.భాస్కరరావు, జి.మోహిని, 8వ వార్డు సచివాలయం ఏఎన్ఎం స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరులకు ఊంజల్ సేవ



స్వామివారిని ఊయలలో ఊపుతున్న భక్తులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీపంచాయతన దేవస్థానంలో గౌరీపరమేశ్వరులకు 195వ ఊంజల్ సేవా కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రి, శేషు, సాయి నిర్వహించారు. అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని వ్యవస్థాపకుడు తిమ్మాపాత్రుని చక్రవర్తి బృంద సభ్యులతో కోలాటాలు, నగర సంకీర్తన వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మీదేవి వ్రతాలు

- పలు ఆలయాల్లో శ్రావణమాస పూజలు



అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు



కనకదుర్గ అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



విజయవాడ కనకదుర్గ అలంకరణలో గవరపాలెం సంతోషిమాత అమ్మవారు

అనకాపల్లి: పట్టణ, మండలంలో శ్రావణమాసం ఆఖరి శుక్రవారం వేడుకలు ఘనంగా జరిగాయి. పలు దేవాలయాల్లో భక్తులు కుంకుమ పూజలు చేపట్టారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

గవరపాలెం నూకాంబిక ఆలయంలో...

ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక దేవాలయంలో వరలక్ష్మీదేవి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి బాలాలయంలో వరలక్ష్మీదేవికి సామూహిక వ్రతాలు భక్తులు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి పూజ అనంతరం ఉచిత ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

గవరపాలెం... : సంతోషిమాత ఆలయంలో అమ్మవారిని విజయవాడ కనకదుర్గాదేవిగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి రాజా సులోచన, భక్తులు పాల్గొన్నారు.

సత్యనారాయణపురంలో...: కనకదుర్గ ఆలయంలో భక్తులు సామూహిక కుంకుమ పూజలు చేపట్టారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ అధ్యక్షుడు యడ్ల త్రినాథ్, ధర్మకర్త బోయిన రమణాజీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కశింకోటలో..

కశింకోట: మండలంలోని పలు ఆలయాల్లో శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకుడు వి.చిదంబరం ఆధ్వర్యంలో స్థానిక శివాలయంలో సర్వమంగళాంబకు సామూహిక కుంకుమార్చనలు చేశారు. మహిళలు ఎక్కువగా హాజరయ్యారు. అర్చకుడు అత్తిలి కోదండపాణి ఆధ్వర్యంలో లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో లక్ష్మీదేవికి కుంకుమార్చనలు చేశారు. వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకుడు రేజేటి సీతారామాచార్యులు, కనక మహాలక్ష్మి ఆలయంలో అర్చకుడు వి. కృష్ణ, ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు, గవరపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు సుబ్రహ్మణ్యంల ఆధ్వర్యంలో లక్ష్మీదేవికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు.

నేడు ప్రత్యేక పూజలు

అనకాపల్లి: స్థానిక వేల్పులవీధిలోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శనివారం నందీశ్వరుడికి ప్రదోషకాల అభిషేకం, శివునికి తైలాభిషేకం నిర్వహించనున్నారు.

వదలని వాన

కశింకోట: మండలంలో రెండో రోజు శుక్రవారం కూడా బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావం వల్ల ఉరుములతో వర్షం కురిసింది. దీంతో పలుచోట్ల రోడ్లు చిత్తడిగా మారడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ప్రధానంగా కశింకోట పీహెచ్‌సీ, ఆర్టీసీ బస్సు స్టేషన్ రోడ్డు బురదమయంగా ఉండటంతో ఇక్కట్లు తప్పలేదు. చిత్తడిగా కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ వరి నాట్లు వేయడానికి, వేసిన నాట్లకు ఉపకరిస్తాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షపాతం ఉదయం 8.30 వరకు 11.2 మిల్లీ మీటర్లు, అప్పటి నుంచి సాయంత్రం 6 గంటల వరకు 6.6 మిల్లీ మీటర్ల వంతున స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నమోదు అయింది. మరో రెండు రోజులు వర్షాలు పడతాయని రెవెన్యూ అధికారులు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

నర్సీపట్నం: న్యాయమైన డిమాండ్లను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎంయు ఎంప్లాయిస్ రెడ్ బ్యాడ్జీలు ధరించి శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో డిపో గేటు వద్ద ధర్నా నిర్వహించారు.

వ్యాధుల బారిన పడకుండా ప్రత్యేక చర్యలు

- ఎంపీపీ గొర్లి సూరిబాబు



సమీక్షిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీడీవో నరసింహరావు, వైద్యురాలు సమీమ్

అనకాపల్లి: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా వైద్య సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తుమ్మపాల పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలన్నారు. సచివాలయాల పరిధిలో ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు ఇంటింటి సర్వేలు నిర్వహించి, ప్రజలు వ్యాధులు బారిన పడకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో వైద్యురాలు ఎస్.కె.సమీమ్, ఎంపీడీవో నరసింహరావు, తుమ్మపాల గ్రామ సర్పంచ్ తట్టాపెంటయ్య నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

1న నవోదయ మోడల్ పరీక్ష

అనకాపల్లి: జిల్లా స్థాయి నవోదయ మోడల్ పరీక్ష వచ్చే నెల ఒకటో తేదీన స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వివేకానంద హాస్పిటల్ వద్ద నిర్వహించనున్నట్లు హెచ్ఎన్‌వీ సైనిక్ నవోదయ అకాడమి ప్రతినిధి నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 4, 5, 6 తరగతులు విద్యార్థులు మాత్రమే పరీక్షకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 8184838525, 9966332708 సంప్రదించాలని కోరారు.

దోమల నివారణకు గంబూషియా చేపలు



నరసింగబిల్లి చెరువులో చేపలను వదులుతున్న ఆరోగ్య సిబ్బంది

కశింకోట: దోమల నివారణకు గంబూషియా చేపలు దోహదపడతాయని వైద్యాధికారి యు. రమేష్ తెలిపారు. తాళ్లపాలెం పీహెచ్‌సీ పరిధిలోని నరసింగబిల్లి, జెట్టపురెడ్డితుని, చింతలపాలెం, ఇ.చౌడువాడ, తాళ్లపాలెం గ్రామాల చెరువుల్లో గంబూషియా చేపలను శుక్రవారం వారు విడిచిపెట్టారు. వీటిని జిల్లా మలేరియా కార్యాలయం ద్వారా సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంబూషియా చేపలు దోమలను నియంత్రిస్తాయన్నారు. దోమల వల్ల వ్యాప్తి చెందే వ్యాధులను ముందుగానే అరికట్టవచ్చన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి వి.ఎ. సుబ్బారావు, ఆరోగ్య బోధకుడు ఎం.ఎస్.వి ప్రసాద్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు



మొక్కలను నాటుతున్న ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ ముకుందరావు



మొక్కలు నాటుతున్న మండల ప్రత్యేకాధికారి రోజారాణి

కశింకోట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మండల ప్రత్యేకాధికారి ఎం. రోజారాణి కోరారు. మండలంలోని ఉగ్గినపాలెం, జమాదులపాలెం గ్రామాల్లో వనం-మనంలో భాగంగా 400 మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలుష్య నివారణకు, పర్యావరణ సమతుల్యానికి మొక్కలు పెంచడం అవసరమన్నారు. ఎంపీడీవో వి.వి. రవికుమార్, ఉపాధి పథకం ఏపీవో శివ, సాంకేతిక సహాయకులు శివాని, సత్యనారాయణ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లి: వన మహోత్సవంలో భాగంగా స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో అనకాపల్లి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు, ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు, వైస్ ప్రిన్సిపాళ్లు ఎం.చారుమతి, జి.కుసుమ శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు వాతావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

'పరిశ్రమల్లో తక్షణమే సేఫ్టీ ఆడిట్ జరపాలి'



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: స్థానిక ఫార్మాసిటీ, అచ్యుతాపురం ఎస్ఈజెడ్ పరిశ్రమల్లో తక్షణమే సేఫ్టీ ఆడిట్ జరిపి, కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫార్మాసిటీలో శుక్రవారం గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లోని ఎసైన్షియా, ఫార్మాసిటీలో సినర్జిన్ పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాలపై సమగ్ర విచారణ జరిపి, యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎసైన్షియా పరిశ్రమలో 17 మంది మరణిస్తే యాజమాన్యాన్ని అరెస్టు చేయకపోవడం విచారకరమన్నారు. ముగ్గురు కార్మికుల మృతికి కారణమైన సినర్జిన్ పరిశ్రమకు రాయితీలు ఇస్తూ, కార్మిక చట్టాలను పట్టించుకోకపోవడం వల్లే తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆక్షేపించారు. వరుస ప్రమాదాలపై తనిఖీలు చేయకపోవడంతో యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. కార్మికులు విధులకు రావాలంటేనే భయపడుతున్నారని పేర్కొన్నారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులకు అవసరమైన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని తక్షణమే నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలు జరిగిన వెంటనే ప్రాథమిక చికిత్స కోసం స్థానికంగా ఎలాంటి సదుపాయాలు లేకపోవడంతో చిన్న ప్రమాదాలు జరిగినా, పట్టణ ప్రాంతాలకు పరుగులు తీయాల్సిన దుస్థితి ఏర్పడుతోందన్నారు. ఈలోగానే కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని మండిపడ్డారు. ఇటీవల ప్రమాదంలో గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందేవిలా చూడాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో భద్రత ప్రమాణాల మెరుగుకు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని గనిశెట్టి హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.అప్పలరాజు, చిట్టిబాబు, మునిసినాయుడు, రమణ, సత్తిబాబు, చిలుకునాయుడు పాల్గొన్నారు.